ముగిసిన 'పది' మూల్యాంకనం

డిఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి - భీమవరం

ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని డిఇఒ ఆర్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీరవాసరంలోని ఎంఆర్‌కె జెడ్‌పి హైస్కూల్లో సమాధాన పత్రాల మూల్యాంకనం చేశారని పేర్కొన్నారు. 1,66,340 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేశామని, దీనికి 856 మంది ఉపాధ్యాయులను వినియోగించామని తెలిపారు. మూల్యాంకనం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన కలెక్టర్, జెసి, డిఆర్ఒ, వివిధ శాఖల జిల్లా అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్‌పి ఛైర్మన్ గిరి దక్కేదెవరికో..!



ప్రస్తుత ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఎంఎల్‌సిగా ఎన్నిక

3 నుంచి ఎంఎల్‌సి బాధ్యతల్లోకి కవురు

నూతన ఛైర్మన్ ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠ

జెడ్‌పి పీఠం బిసి సామాజిక తరగతికి రిజర్వు

ఛైర్మన్ పదవి రేసులో ప్రముఖంగా పెదపాడు జెడ్‌పిటిసి పేరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిపై ఉత్కంఠ సాగుతోంది. ప్రస్తుత జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న కవురు శ్రీనివాస్ స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా ఎన్నిక కావడంతో ఛైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోననే చర్చ రాజకీయాల్లో విస్తృతంగా సాగుతోంది. మే మూడోతేదీ తర్వాత కవురు శ్రీనివాస్ పూర్తిస్థాయి ఎంఎల్‌సిగా బాధ్యతల్లోకి వెళ్లనున్నారు. సమయం దగ్గర పడుతుండటంతో ఛైర్మన్ పదవికి అభ్యర్థి ఎంపిక చర్చనీయాంశంగా మారింది. ఎంఎల్‌సిగా ఎన్నికైనప్పటికీ అధికారికంగా పదవీబాధ్యతలు చేపట్టకపోవడంతో ఇప్పటికీ కవురు శ్రీనివాస్‌నే జెడ్‌పి ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. మే మూడో తేదీ తర్వాత ఆయన ఆ పదవి నుంచి వైదొలగాల్సి ఉంది. దీంతో తదుపరి జెడ్‌పి ఛైర్మన్ ఎవరు అనే అంశం ఉత్కంఠ రేపుతోంది. 2021లో జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి కేటాయించబడింది. దీంతో కవురు శ్రీనివాస్‌ను జెడ్‌పి ఛైర్మన్ అభ్యర్థిగా వైసిపి ప్రకటించింది. యలమంచిలి మండల జెడ్‌పిటిసిగా కవురు గెలిచి ఛైర్మన్ పీఠం అధిరోహించారు. పట్టుమని రెండేళ్లు గడవకముందే కవురు శ్రీనివాస్‌కు మళ్లీ ఎంఎల్‌సిగా వైసిపి అధిష్టానం అవకాశం కల్పించింది. సామాజిక తరగతి లెక్కల్లో భాగంగా కవురును ఎంఎల్‌సిగా పోటీలో దింపారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో కవురు గెలుపొందడంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ఆ పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. జిల్లాల విభజన పూర్తయినప్పటికీ జిల్లా పరిషత్ మాత్రం ఉమ్మడి జిల్లాగానే కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 48 మండలాలు ఉండగా 46 స్థానాల్లో వైసిపి జెడ్‌పిటిసిలే గెలిచారు. మొత్తం గెలిచిన స్థానాల్లో పది చోట్ల బిసిలు ఉన్నారు. ఇందులో యలమంచిలి, భీమడోలు, భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, పాలకోడేరు, పెదపాడు, ఉండి, ఉంగుటూరు జెడ్‌పిటిసి స్థానాలు ఉన్నాయి. వీటిలో ఐదుస్థానాలు బిసి మహిళలు గెలిచారు. కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్ పదవి నుండి తప్పుకోవడంతో ఆ పదవి కోసం బిసి సామాజిక తరగతికి చెందిన జెడ్‌పిటిసిలంతా తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారు. ప్రముఖంగా మాత్రం పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీ పేరు వినిపిస్తోంది. గంటా పద్మశ్రీ కాబోయే జెడ్‌పి ఛైర్మన్ అంటూ పలు సమావేశాల్లో దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బాయి చౌదరి సైతం ప్రకటించడం జరిగింది. అయితే అధిష్టానం మదిలో ఏముందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఏలూరు జిల్లాకు జెడ్‌పి ఛైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు ఇవ్వాలంటూ ఈ జిల్లాలోని వైసిపి నేతలు గట్టిగా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనేక కారణాలున్నాయి. ప్రధాన పదవుల్లో ఉన్న నాయకులంతా పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉన్నారు. రెండు మంత్రి పదవులు పశ్చిమకే దక్కాయి. శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు భీమవరానికి చెందినవారే. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిలుగా ఎన్నికైన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ కూడా అదే జిల్లాకు చెందిన వారు. డిసిసిబి ఛైర్మన్, డిసిఎంఎస్ ఛైర్మన్ పదవులు అదే జిల్లాకు చెందిన నాయకులకు దక్కాయి. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు చెందిన వ్యక్తికి ఇవ్వాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఈ జిల్లాలో ఎంతోకొంత బలం ఉన్న జెడ్‌పిటిసిగా గంటా పద్మశ్రీ పేరు వినిపిస్తోంది. అదే సమయంలో మరో ప్రచారం కూడా జరుగుతోంది. కవురు శ్రీనివాస్ రాజీనామా చేసిన యలమంచిలి జెడ్‌పిటిసి స్థానానికి ఎన్నిక నిర్వహించిన తర్వాతే ఛైర్మన్ పదవి భర్తీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. తమకు నచ్చిన నాయకుడిని యలమంచిలి జెడ్‌పిటిసిగా గెలిపించి ఛైర్మన్ పదవి సదరు నాయకుడికి కట్టబెట్టాలనే ఆలోచన సైతం అధిష్టానం మదిలో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ ఎవరో అనే చర్చ జిల్లాలో విస్తృతంగా సాగుతోంది.

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఫస్టియర్‌లో 2వ, సెకండియర్‌లో 3వ స్థానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గత మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లాలో విద్యార్థినులు సత్తా చాటారు. బాలురకన్నా బాలికలే మెరుగైన ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫలితాలు బుధవారం సాయంత్రం విడుదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఫస్టియర్ ఫలితాల్లో 70 శాతం ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్ ఫలితాల్లో 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించగా బాలురు 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బాలికలు 58 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురు 37 శాతం ఉత్తీర్ణత సాధించారు. సాధారణ విభాగంలో మొదటి సంవత్సరం పరీక్షలకు 29,110 మంది హాజరవ్వగా 70 శాతంతో 20,237 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 27,691 మంది హాజరవ్వగా 77 శాతంతో 21,359 మంది ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యా విభాగంలో మొదటి సంవత్సరం పరీక్షలకు 36,031 మంది హాజరవ్వగా 49 శాతంతో 17,507 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 31,293 మంది హాజరవ్వగా 62 శాతంతో 19,430 మంది ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరం ఫలితాలతో పోలిస్తే సాధారణ విభాగంలో ఐదో స్థానంలో ఉన్న జిల్లా ఈ సంవత్సరం మొదటి సంవత్సరం ఫలితాల్లో ద్వితీయ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మూడో స్థానం సాధించింది. గత ఐదు సంవత్సరాల ఫలితాలు చూస్తే 2018లో 75 శాతంతో జిల్లా ఐదోస్థానంలోనూ, 2019లో 74 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానం, 2020లో 71 శాతం ఉత్తీర్ణతతో రెండో స్థానంలోనూ 2022లో 64 శాతం ఉత్తీర్ణతతో ఐదో స్థానంలోనూ నిలిచింది. 2021లో కరోనా కారణంగా ఇంటర్ పరీక్షలు జరగలేదు. గత ఫలితాలతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని చెప్పొచ్చు.

రూ.31.69 కోట్లు వసతి దీవెన సొమ్ము విడుదల: కలెక్టర్

నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న వసతి దీవెన పథకంలో భాగంగా జిల్లాలో 33,231 మంది తల్లుల ఖాతాల్లో రూ.31.69 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం జగనన్న వసతి దీవెన మాన్యువల్ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో డిగ్రీ నుంచి పీజీ వరకు, ఇంజినీరింగ్, మెడికల్ ఇతర కోర్సులు చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఇబిసి, మైనారిటీ విద్యార్థులకు 2022-23 విద్యా సంవత్సరానికి మొదటి విడత జగనన్న వసతి దీవెనకు సంబంధించి 33,231 మంది విద్యార్థులకు చెందిన 29,683 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.31.69 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లాలో 5,496 మంది ఎస్‌సి విద్యార్థులకు రూ.5.15 కోట్లు, 175 మంది ఎస్‌టి విద్యార్థులకు రూ.0.16 కోట్లు, 15,362 మంది బిసి విద్యార్థులకు రూ.14.61 కోట్లు, 3,179 మంది ఇబిసి విద్యార్థులకు రూ.3.08 కోట్లు, 7995 మంది కాపు విద్యార్థులకు రూ.7.69 కోట్లు, 351 ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.0.33 కోట్లు, 672 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.0.64 కోట్లు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఆచంట నియోజకవర్గంలో 4837 మంది విద్యార్థులకు రూ.4.61 కోట్లు, భీమవరం నియోజకవర్గంలో 5,107 మంది విద్యార్థులకు రూ.4.89 కోట్లు, నరసాపురం నియోజకవర్గంలో 3,949 మంది విద్యార్థులకు రూ.3.79 కోట్లు, పాలకొల్లు నియోజకవర్గంలో 3,979 మంది విద్యార్థులకు రూ.3.76 కోట్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 4,999 మంది విద్యార్థులకు రూ.4.76 కోట్లు, తణుకు నియోజకవర్గంలో 5,681 మంది విద్యార్థులకు రూ.5.38 కోట్లు, ఉండి నియోజకవర్గంలో 4,719 మంది విద్యార్థులకు రూ.4.48 కోట్లు జమ కానున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జివిఆర్‌కెఎస్‌ఎస్.గణపతిరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

బాలికను ప్రలోభ పెట్టి.. ఆపై అత్యాచారం

ఆటో డ్రైవర్ నిర్వాకం

ప్రజాశక్తి - తణుకు

పట్టణానికి చెందిన బాలికను (13) ప్రలోభపెట్టి ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం ఏడో తరగతి చదువుతున్న బాలిక నివాసానికి సమీప ప్రాంతంలో ఉంటున్న ఆటోడ్రైవర్ మునగాల దుర్గాప్రసాద్ ఆమెపై కన్నువేశాడు. ఆమెతో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి మూడునెలలుగా పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాలిక ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబీకులకు అనుమానం వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు బాలిక గర్భవతి అని నిర్ధారించడంతో వారు బాలికను గట్టిగా నిలదీయంగా ఆటో డ్రైవర్ నిర్వాకాన్ని చెప్పింది. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు దుర్గాప్రసాద్‌ను అదుపులో తీసుకుని ఫోక్సో, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. నరసాపురం డిఎస్‌పి పర్యవేక్షణలో తణుకు సిఐ ముత్యాల సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ సస్పెన్షన్ల రద్దు కోరుతూ ఫ్యాప్టో నిరసన

భీమవరంలో..

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులపై విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ చేపట్టిన చర్యలను ఖండిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన స్థానిక తాలుకా కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు సకాలంలో ఇవ్వలేదని, ఇచ్చిన పుస్తకాలు దఫదఫాలుగా ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికీ కొన్ని పుస్తకాలు రాని విషయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. కొలతల ప్రకారం లేని బూట్లు, నాణ్యత లేని బ్యాగ్‌లకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయులపై తక్షణం అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామచంద్రరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, డిటిఎఫ్ నాయకులు ఎన్.శ్రీనివాసరావు, వివిధ సంఘాల నేతలు సిహెచ్.పట్టాభిరామయ్య, కె.రామకృష్ణప్రసాద్, జి.రామకృష్ణంరాజు, వి.జనార్ధన్, ఐ.శ్రీనివాసరావు, కె.త్రిమూర్తులు, పివి.రమణరాజు, పాండురంగారావు, జోసెఫ్, విఎస్‌పి.శ్రీనివాస్, జివి.రమణ, జిడి.భవానిప్రసాద్, పి.సీతారామరాజు, కె.చంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ చర్యలను నిరసిస్తూ, ఉపాధ్యాయులపై అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నిరసన తెలిపారు. కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస్ మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేదని షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు విధించడం తగదన్నారు. విలీనం పేరుతో పాఠశాల విద్యా వ్యవస్థలో గందరగోళం సృష్టించారని, పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను దూర ప్రాంతాలకు పంపించి, ప్రమోషన్లు ఇవ్వక, నియామకాలు చేపట్టక, క్షేత్రస్థాయి ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా ఇబ్బంది పెట్టడమే కాక పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుల మానసిక స్థైర్యం దెబ్బతినేలా ప్రవర్తించడం మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పి. క్రాంతికుమార్, ఎ.దేవేంద్రుడు, ఎంవి.రాజశేఖర్, వలవల శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, పులఖండం శ్రీనివాస్, కేతా నాగరాజు, వి.జగ్గారావు, పి.రామ్మూర్తినాయుడు, కె.త్రినాథ్, ఎం.అరుణ్‌కుమార్, విఎబి.సుబ్రహ్మణ్యం, ఈదా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి: వ్యకాస

ప్రజాశక్తి - పోడూరు

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు నేత పిల్లి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మూడే మోజెష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నేతలు బుధవారం ఉపాధి పని ప్రదేశాలకు వెళ్లి కూలీలను కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బిజెపి పాలనలో కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఆలోచన చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిత్యావసరాల ధరలు అదుపు చేయడంలో విఫలమైందని విమర్శించారు. అనంతరం మోజెష్ మాట్లాడుతూ కూలీలకు టెంట్లు, మజ్జిగ అందించడం లేదని విమర్శించారు. గతంలో వలె ఒక పూట పని విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతు శ్రీనివాస్, మల్లుల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విఆర్‌ఎల వినతి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని జిల్లా విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు బుంగా గణేష్‌రావు కోరారు. సంఘం ఆధ్వర్యంలో నేతలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ పి.ప్రశాంతికి, జిల్లా ట్రెజరీ అధికారికి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్‌రావు మాట్లాడుతూ డిఎ రికవరీకి సంబంధించి హైకోర్టులో ఉందని, ఈ నేపథ్యంలో రికవరీని నిలుపుదల చేయాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్‌వాచ్‌మెన్, డ్రైవర్, విఆర్‌ఒ పోస్టులను అర్హులైన విఆర్‌ఎల నుంచి భర్తీ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఖాళీలు ఎక్కడెక్కడున్నాయో పరిశీలించి భర్తీ చేయడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు మోటూరి మోషే, బివివి.పండు, సుబ్బారావు, సురేష్, శ్రీకాంత్, శంకరం, కన్నయ్య, మల్లయ్య, కోటేశ్వరరావు, నరసయ్య, పీటర్సన్, సంధ్యారాణి, పౌలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులపై వేధింపులు ఆపాలి

ఎపి పంచాయతీ వర్కర్స్ యూనియన్

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

పంచాయతీ కార్మికులకు జీతాలు తగ్గించడం, చేస్తున్న పనిని మాన్పించడం, వేరే పనికి కేటాయించడం వంటి వేధింపులను ఆపాలని పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో చింతా రాజారెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇంటి వెంకటేశ్వరరావు మాట్లాడారు. పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న జిఒలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం టెండర్‌తో సంబంధం లేకుండా ఉద్యోగాలను కొనసాగించాలన్నారు. పంచాయతీల్లో కార్మికులకు పనిముట్లు పంచాయతీలే కొని ఇవ్వాలని, యూనిఫారం, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు ప్రతియేటా అందించాలన్నారు. గుర్తింపు కార్డులు తయారు చేసి కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. సంఘం గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో కొన్ని పంచాయతీల్లో కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని, చేస్తున్న పనిని ఆపి వేరే పని చేయాలని చెప్పడం, వేతనాలు తగ్గించి ఇస్తామనడం తదితర వేధింపులను ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కనీస వేతనం లేకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. కరోనా సమయంలో పంచాయతీ కార్మికుల సేవలను కొనియాడిన ప్రభుత్వం కార్మికుల యోగక్షేమాలను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మల్లుల ఏసుబాబు, రాజబాబు, శివ, కిరణ్, నాగార్జున, బాపనయ్య, శ్రీను పాల్గొని మాట్లాడారు.

రైతులతో మాట్లాడుతున్న శివరామప్రసాద్

తేమశాతాన్ని కచ్చితంగా పరిశీలించుకోవాలి

ప్రజాశక్తి - అత్తిలి

ప్రతి రైతూ వరిపంట కోసిన వెంటనే తేమ శాతాన్ని కచ్చితంగా పరిశీలించుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి టి.శివరామప్రసాద్ అన్నారు. బుధవారం బల్లిపాడు, అత్తిలి రైతు భరోసా కేంద్రాలు, వెంకటేశ్వర రైస్‌మిల్లులకు ఆయన వెళ్లి ధాన్యం ఎగుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా శివరామప్రసాద్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం 17 శాతం తేమ ఉన్నప్పుడు మిల్లులకు పంపుకోవాలన్నారు. ఎక్కువగా ఎండబెడితే నూక శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయులు, ఎఒ టికె.రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఆక్వా సాగులో యాజమాన్య పద్ధతులు పాటించండి

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - వీరవాసరం

ఆక్వా (రొయ్య) సాగులో అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవాలంటే సక్రమమైన యాజయాన్య పద్ధతులు పాటించాలని భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రొయ్య రైతుల సమస్యలు, సంక్షేమం పథకాలపై అవగాహనా సదస్సు బుధవారం స్థానిక తులసి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ప్రముఖ రొయ్య సాగు రైతు మళ్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో చేసిన పొరపాట్లను మరిచి రొయ్యల సాగు చేసే రైతులు నష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఎటువంటి పరీక్షలూ చేయకుండానే నాణ్యమైన సీడ్‌ను సాగు చేయకపోవడం, సరైన సాగు, మురుగునీరు వ్యవస్థ ఏర్పాట్లు చేసుకోకపోవడం వల్లే ఎక్కువగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఆక్వా పరిశ్రమను పరిరక్షించుకోవడానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత కోవిడ్ కాలంలో నిబంధనలు సడలించి ప్రాసెసింగ్ యూనిట్లను తెరిపించి, దానిపై ఆధారపడ్డ అనుబంధ రంగాలకు, రైతులకు మేలు చేశారన్నారు. ప్రభుత్వానికి ఎగుమతిదారుడు, రైతు ఇద్దరు ముఖ్యమైనవారేనన్నారు. విద్యుత్ రాయితీ అర్హతున్న అందరి రైతులకు అందించాలని, ఎక్కడ రొయ్య సాగు చేస్తే ఆ ప్రాంతాన్ని ఆక్వా జోన్‌గా ప్రకటించారని తెలిపారు. ఈక్వెడార్ వంటి దేశాల నుండి మన రొయ్య మార్కెట్‌కు గట్టి పోటీ ఎదరవుతుందన్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడి ఎప్పటికప్పుడు వారికి ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ రాయితీ పొందుతున్న వారు వైసిపి ప్రభుత్వానికి అండగా ఉండటం లేదని తెలిసినా సిఎం జగన్మోహన్‌రెడ్డి రాయితీని కొనసాగిస్తున్నారన్నారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ రైతు సంక్షేమం విస్మరించిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదన్నారు. కోవిడ్ సమయంలో ఎపి ప్రభుత్వ సహకారం మరువలేనిదన్నారు. దేశంలో 70 శాతం ఆక్వా సాగు ఎపి నుంచే జరుగుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌ను తట్టుకోవాలంటే ప్రత్యామ్నాయంగా దేశీయ మార్కెట్‌ను పెంచుకోవాలన్నారు. ఎపి స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వడ్డే రఘురాం మాట్లాడుతూ ప్రభుత్వానికి, రొయ్యల రైతులకు అనుబంధంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ ద్వారా దేశీయ మార్కెట్‌ను పెంచుకోవడం వల్ల సన్న, చిన్నకారు రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఆక్వా రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాజు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కుమార్‌రాజా, మాజీ జెడ్‌పిటిసిలు మానుకొండ ప్రదీప్‌కుమార్, పోలిశెట్టి సత్యనారాయణ, ఆర్‌డిఒ దాసి రాజు, తోలేరు ఉప సర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు, గోపిరాజు, తహశీల్దార్ సుందరాజు పాల్గొన్నారు.

రొయ్య రైతులు ప్రభుత్వం ముందుంచిన సమస్యలివే

ఈ సదస్సు ద్వారా రొయ్యల రైతులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం ముందుంచారు. నాణ్యమైన రొయ్య పిల్ల దొరికే విధంగా చర్యలు తీసుకోవాలని, నాణ్యతలేని రొయ్య పిల్లను ఉత్పత్తి చేసే హేచరీలపై చర్యలు తీసుకోవాలని, పెరిగిన దాణా ఖర్చులు తగ్గించాలని, రొయ్య పిల్లకు నిర్దిష్టమైన ధర నిర్ణయించాలని, కంపెనీలు తమ ఉత్పత్తులను ఒకే రేటుతో విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని, చెరువుల వద్ద జరుగుతున్న దొంగతనాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి తద్వారా పోయిన వస్తువులు రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆక్వాసాగుకు సంబంధంలేని వ్యక్తులు చేస్తున్న ఫిర్యాదులపై అధికారులు ఆలోచించాలని, వీరవాసరం మండలానికి ఉన్న పాత విద్యుత్ లైనును మార్చి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఉంటా

మత్స్యపురి సొసైటీ ఛైర్మన్ కురెళ్ల కాశీవిశ్వేశ్వరరావు (కాశీ)



బాధ్యతలు స్వీకరిస్తున్న కాశీవిశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - వీరవాసరం

రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మత్స్యపురి సహకార సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కురెళ్ల కాశీవిశ్వేశ్వరరావు (కాశీ) అన్నారు. సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా విశ్వేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాశీ మాట్లాడుతూ తనకు ఈ సంఘం ద్వారా సేవ చేసేందుకు అవకాశం కల్పించిన ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నాగరాజు, మాజీ ఛైర్మన్ కోటిపల్లి వెంకటబాపూజీరావు, కమిటీ సభ్యులు పాలా నెలబాలుడు, పోతుల లీలాకర్, భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసిపి మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, బాలేపల్లి సర్పంచి యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ మతల కాశీ పాల్గొన్నారు.

మాంటిస్సోరి విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

గుబ్బల పావని

ప్రజాశక్తి - పాలకొల్లు
స్థానిక ఎల్ఆర్‌పేటలోని మాంటిస్సోరి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చారు. ఎంపిసి సెకండియర్ విద్యార్థిని గుబ్బల పావని 989 మార్కులతో రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించింది. బైపిసిలో పి.హర్షిత 984, జి.తానియా 984 మార్కులతో ఎనిమిదో స్థానంలోనూ, జి.సాత్విక 983 మార్కులతో తొమ్మిదో స్థానం, సిఇసి విభాగంలో జె.ఊర్మిళ 963 మార్కులతో రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంకును సాధించారు. ఫస్టియర్ సిఇసిలో షేక్ కరీమున్నీసా 479 మార్కులతో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం, ఎంపిసిలో వి.హేమశ్రీ 464 మార్కులతో తృతీయ స్థానం, వి.హారిక, జి.పల్లవి, కె.మైత్రవింద 463 మార్కులతో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచారు. కె.శ్రావణి 461 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఆరో స్థానం, బైపిసిలో ఎం.స్వర్ణ పుష్ప 422 మార్కులతో రాష్ట్రస్థాయిలో తొమ్మిదో స్థానం నిలిచారని ప్రిన్సిపల్ ఎం.సెక్రటరీ కెవి.కృష్ణవర్మ తెలిపారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవంతో, అంకితభావం కలిగిన అధ్యాపకుల సహకారంతో, ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందించడం వల్ల తాము ఈ మెరుగైన ఫలితాలను సాధించామన్నారు. రానున్న కాలంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థులను, ప్రిన్సిపల్ ఎస్‌వివిఎస్.ప్రకాశరావు, ఇన్‌ఛార్జ్ నడపన గీత, అధ్యాపకులు బివి.సత్యనారాయణ, వి.రామకోటేశ్వరరావు, ఎస్.మల్లికార్జునరావు, బి.చిరంజీవి, బి.రవికాంత్, ఆర్.సునీల్, డి.దివ్య, ఎస్.కృష్ణవేణి, పి.మల్లేశ్వరి, యు.శైలజ, ఎన్.ఉషారాణి, అధ్యాపకేతర సిబ్బందిని కళాశాల ఛైర్మన్ చిలుకూరి కుమార్ అభినందించారు.

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి - ఉండి
ఇంటర్ ఫలితాల్లో మండలంలో బాలికలు సత్తా చాటారు. దివ్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 70 మంది పరీక్షకు హాజరవ్వగా 54 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 130 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా అంతా మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రాంబాబు తెలిపారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా బాలికలకు మాత్రమే జూనియర్ కళాశాల ప్రారంభించగా ఎనిమిది మంది విద్యార్థినులు హాజరయ్యారు. వారిలో ఒక్కరే ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుని బేబీ తెలిపారు.

విద్యావికాస్, వాసవీ శారద విజయకేతనం

ప్రజాశక్తి - ఆకివీడు
బుధవారం ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. 5 గంటలకు మంత్రి ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా గంట ఆలస్యంగా విడుదల చేశారు. దీనితోడు సర్వర్లు కాస్త మొరాయించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సీనియర్ ఇంటర్‌లో బైపిసి విభాగంలో వాసవీ శారద జూనియర్ కళాశాల విద్యార్థి కె.హేమలత 977 మార్కులతో మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఎంపిసిలో 988 మార్కులతో కార్తికేయ మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. సిఇసి విభాగంలో పఠివాద గీత 879 మార్కులతో మండల ప్రథమ స్థానం పొందింది. జూనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో విద్యావికాస్ మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ఎంపీసీలో 458 మార్కులతో బుర్ర బిందు, 464 మార్కులతో గంట భార్గవి ప్రథమ స్థానం సాధించారు. బైపిసిలో కార్తికేయ జూనియర్ కళాశాల విద్యార్థి శ్రీజ్యోత్స్న 416 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచింది.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర
ప్రతి ఉపాధ్యాయుడూ తమ పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాల పనితీరు గురించి సోషల్ ఆడిట్ యాప్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న తెలిపారు. బుధవారం పెనుమంట్ర హైస్కూల్లో సోషల్ ఆడిట్ యాప్‌పై మండలం పరిధిలోని హైస్కూళ్ళు, యుపి, ప్రాథమిక స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ మౌలిక సదుపాయాలు, వనరులు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వంటి వాటిని పర్యవేక్షించి ఆడిట్ యాప్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిక పంపాలన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ బుచ్చిబాబు శిక్షణ ఇచ్చారు.

ఉండి : ప్రభుత్వం అందించే శిక్షణ తీసుకుని ప్రధానోపాధ్యాయులు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒ ఎ.రవీంద్ర అధ్యక్షతన మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్ మూల్యాంకనంపై ఒక రోజు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అగ్రస్థానం వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముక్కు వెంకట సత్యనారాయణ, చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్బర్ చక్రవర్తి పాల్గొన్నారు.

వనరులను సక్రమంగా వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం
మానవ వనరులను సక్రమంగా వినియోగించుకున్నప్పుడే మంచి ఫలితాలు సాధించగలుగుతామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న వారందరికీ 50 నుండి 60 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని, జాబ్ కార్డులు కలిగి ఉండి పనికిరాని వారి కార్డులు తొలగించాలని తెలిపారు. జిల్లాలో గృహ నిర్మాణం చేసేందుకు లేఅవుట్లలో రోడ్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు, వాటర్, తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎస్‌టి.రామేశ్వరరావు, డిపిఒ మల్లికార్జునరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

నూక శాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర
మండలంలో సాగు చేస్తున్న వరిలో కొన్ని రకాల్లో నూక ఎక్కువగా వస్తోందని, నూక శాతం తగ్గించుకోవడానికి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గోదావరి మండలాల్లోని సుమారు 2.75 లక్షల హెక్టార్లలో రైతులు దాళ్వా సాగు చేపట్టారని తెలిపారు. ఎంటియు 1121, ఎంటియు 1153, ఎంటియు 3626, ఎన్ఎల్ 10, పిఆర్ 126 రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. రబీలో ఎదుర్కొన్న ప్రధాన సమస్య మిల్లింగ్‌లో గింజ విరిగిపోయి నూక ఎక్కువగా వస్తోందని తెలిపారు. దీనివల్ల బస్తాకు 2 నుంచి 3 కిలోల అదనంగా కోల్పోవలసి వస్తోందని రైతులు ఆదాయం తగ్గిపోతుంది గమనిస్తున్నామన్నారు. ప్రస్తుతం రబీలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా ఎనిమిది కారణాల వల్ల నూక ఎక్కువగా వస్తోందన్నారు. మిల్లింగ్‌లో నూకశాతం తగ్గించేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - అత్తిలి
సీనియర్ మహిళా కూలీలను గౌరవించడం మన సంప్రదాయమని ఎన్ఆర్ఇజిఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌టి.రామేశ్వరరావు అన్నారు. బుధవారం ఉనికలి అమృత్ సరోవర్ నిర్మాణంలో చెరువు బ్యాంకు పనితీరును ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు కూలీలతో మాట్లాడారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని మేట్లకు సూచించారు. అనంతరం ప్రథమ చికిత్స పెట్టెలు, శాశ్వత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్ సాగర్, ఎపిఒ సరస్వతి, సెక్రటరీ ప్రభ, టెక్నికల్ అసిస్టెంట్ బి.నవ్యలత, ఫీల్డ్ అసిస్టెంట్ టి.శాంతి స్వరూప్, కూలీలు, ఉపాధి వేతనదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

ఉండి పిహెచ్‌సి వైద్యులు పంజా ధర్మతేజ

చిట్ చాట్

ప్రజాశక్తి - ఉండి
ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని ఉండి పిహెచ్‌సి డాక్టర్ పంజా ధర్మతేజ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న: ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంత మంది సిబ్బంది ఉన్నారు?
పిహెచ్‌సి పరిధిలో ఇద్దరు డాక్టర్లు, ఒక ఫార్మాసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు సూపర్‌వైజర్లు, పది మంది ఎఎన్‌ఎంలు, 29 మంది ఆశా కార్యకర్తలు, తొమ్మిది విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో 9 మంది ఎంఎల్‌హెచ్‌పిలు ఉన్నారు.

ప్రశ్న: వైరల్ జ్వరాలు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
ప్రస్తుత కాలంలో వైరల్ జ్వరాలు తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా రోడ్లపై అమ్మే ఆహారాలు తినకూడదు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల వైరల్ జ్వరాల బారిన పడకుండా ఉండొచ్చు.

ప్రశ్న : కోవిడ్ వ్యాప్తిని ఏ విధంగా అరికట్టవచ్చు?
మండలంలో ఆశా కార్యకర్తలు ఫీవర్ సర్వేలో పాల్గొంటున్నారు. ఎవరికైనా కోవిడ్ అని అనుమానం ఉంటే తక్షణం సంబంధిత హెల్త్ క్లినిక్‌లో పరీక్షలు చేయించుకోవాలి. కోవిడ్ పాజిటివ్ అయితే వెంటనే మందుల కిట్ అందజేస్తాం. ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటిస్తూ మాస్క్ ధరించి, శానిటైజర్ వాడాలి. తద్వారా కరోనా వ్యాప్తిని అరికట్టవచ్చు.

ప్రశ్న : గర్భిణులకు మీరిచ్చే సలహా?
గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి. ప్రతి నెలా 9, 10 తేదీల్లో పిహెచ్‌సిల్లో నిర్వహించే రక్త పరీక్షలు చేయించుకోవాలి.

ప్రశ్న : పిహెచ్‌సిలో కుక్కకాటు మందులున్నాయా?
ఉండి పిహెచ్‌సిలో కుక్కకాటుకు మందులు అందుబాటులోనే ఉన్నాయి. పాము కాటుకు అయితే ప్రథమ చికిత్స చేసి రోగిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తాం.

ప్రశ్న :వేసవి కాలం నేపథ్యంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి
ప్రస్తుతం వేసవి తాపం ఎక్కువగా ఉన్న కారణంగా ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకూ ఇంటిలో తయారు చేసుకుని మజ్జిగ, జ్యూస్ తాగాలి. అలాగే నీరు ఎక్కువగా తీసుకోవాలి. కూల్ డ్రింకులకు దూరంగా ఉండాలి.

29 నుంచి కాళ్లకూరు వెంకన్న కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల
కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 29వ తేదీ శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. వైశాఖ శుద్ధ నవమి పూజలు, మత్స గ్రహణం, అంకురార్పణ, ధ్వజారోహణం సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. కళ్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లూ చేశామని, ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ ప్రాంగణం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీన స్వామివారిని పెండ్లికుమారుడుని చేయడం, మే 1న స్వామివారి కళ్యాణం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, స్రవంతి దంపతులు చేయనున్నారు. 2న మల్లెపూలతో విశేషార్చన, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు జరగనున్నాయి. 3న లిల్లీ, 4న కనకాంబరాలు, 5న రజిత పుష్పాలతో విశేషార్చన జరగనుంది. 6న చక్రస్నానం నీరాజన మంత్రపుష్ప, ప్రసాద వినియోగం జరగనుంది. 7న స్వామివారికి గులాబీలతో విశేషార్చన జరగనుంది. 13న అఖండ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.


దేవస్థానం ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు

ఆలయ ఇఒ అరుణ్ కుమార్

పిల్లలకు గుండె పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్
స్థానిక సుందరయ్య భవనంలో వసుధ ఫౌండేషన్, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 15 సంవత్సరాల్లోపు పిల్లలకు మంగళవారం రాత్రి ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ఇంటర్ వెన్షనల్ చిల్డ్రన్ కార్డియాలజిస్ట్ విక్రమ్ పిల్లలకు ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు రాయడంతో పాటు ఆపరేషన్ చేయాల్సిన చిన్నారులను గుర్తించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రానికి వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లులో 'రంగమార్తాండ' ఉచిత ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు
హరివిల్లు సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఉత్తమ చిత్రంగా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న రంగమార్తాండ చిత్రం పాలకొల్లు అడబాల థియేటర్లో బుధవారం ఉచితంగా ప్రదర్శించారు. పట్టణంలోని కళాకారులు, కళాభిమానులు, మేధావులు విచ్చేసి ఈ చిత్ర విజయానికి కారకులైన దర్శకులు కృష్ణవంశీ ప్రతిభకు, ప్రకాష్‌రాజ్ బ్రహ్మానందం, రమ్యకృష్ణ నటనకు ముగ్దులయ్యారు. దర్శకులు కృష్ణవంశీ హరివిల్లు అధ్యక్షులు వంగా నరసింహారావును ఫోన్లో అభినందించారు.

శ్రీనివాస్‌కు ఆంధ్రరత్న అవార్డు అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్
ఈ నెల 24న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాముల తెలుగు యూనివర్శిటీలో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య భీమవరానికి చెందిన డాక్టర్ కొల్లు శ్రీనివాస్ చేసిన సేవలకు గాను ఆంధ్రరత్న అవార్డుతో సత్కరించడం గొప్ప విశేషమని పలువురు స్వచ్ఛంద సంస్థల సభ్యులు కొనియాడారు. బుధవారం స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో కొల్లు శ్రీనివాస్‌ను స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సత్కరించారు. అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, త్యాగరాజ భక్త సభ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ సభ్యులు కారుమూరి చినబాబు మాట్లాడారు. అవార్డు గ్రహీత శ్రీనివాస్ మాట్లాడుతూ అవార్డుతో నా బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. కార్యక్రమంలో చుక్కనశ్రీ, కొండ్రు శ్రీనివాస్, నీలాతి పోతయ్య పాల్గొన్నారు.

భీమవరంలో త్యాగరాజ స్వామి విగ్రహావిష్కరణ

భీమవరం రూరల్: త్యాగరాజ స్వామి 256వ జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో బుధవారం త్యాగరాజ స్వామి పాలరాయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. త్యాగరాజ వర్తక సంఘం, త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మావుళ్లమ్మ దేవస్థానం ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్ష్యాత్తు నారదుడి వద్ద నుంచి 'స్వరార్ణవం', 'నారదీయం' అనే సంగీత గ్రంథాలను వరంగా పొందిన ధన్యుడు త్యాగరాజు అని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి కారుమూరి ఆదిత్య, రాజా, సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, కారుమూరి చినబాబు, కారుమూరి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.


సంచార జీవులకు నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధి వెంకట్రావు

'ఛారిటీ బాక్సు ట్రస్టు' ఆధ్వర్యాన నిత్యావసరాలు అందజేత

తాడేపల్లిగూడెం: ఛారిటీ బాక్సు ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో వెంకటరామ థియేటర్ దగ్గర పరదాల్లో నివాసం ఉంటున్న సంచార జీవులకు బుధవారం నిత్యావసరాలు అందజేశారు. ఈ ప్రాంతంలోని ఇరవై కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛారిటీ బాక్సు ప్రతినిధి కోదాటి వెంకటరావు మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణమే ఛారిటీ లక్ష్యమన్నారు. ఒక్కో పేద కుటుంబానికి కందిపప్పు, గోధుమ పిండి, పంచదార, ఉప్మానూక, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు అందజేశారు. దయాగుణం, సేవాభావమే ఛారిటీ బాక్సును ముందుకు నడిపిస్తోందన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రొక్కాల నాగబుజ్జీ, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య మాట్లాడారు.

మేడేను విజయవంతం చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి - ఉండి
మే 1న జరిగే కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు సిఐటియు శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఉండి మెయిన్ సెంటర్లోని ప్రజా సంఘాల కార్యాలయంలో కొట్టాడ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే ఒకటో తేదీన శ్రామికుల జీవితాల్లో పెను మార్పులకు శ్రీకారం చుట్టిన శుభదినం అన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చామకుర్తి దేవి కుమారి, బేవరేజెస్ హమాలీ వర్కర్స్ యూనియన్ నేతలు బైరెడ్డి, బాలాజీ, భీమవరం తాలూకా రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : మేడే వేడుకలను విజయవంతం చేయాలని సిఐటియు అధ్యక్షులు మండా సూరిబాబు అన్నారు. కాళ్లలో సిఐటియు మండల కమిటీ సమావేశం శివాలయంలో మండా సూరిబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కార్మికుల నివసించే ప్రాంతాల్లో ఆటల పోటీలు నిర్వహించాలని, విజేతలకు బహుమతులు అందించాలని, మేడే రోజు కాళ్లలో పెద్ద ఎత్తున ప్రదర్శన సభ నిర్వహించాలని కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు దావులూరి మార్తమ్మ, ఝాన్సీ, గంటా భవాని, ఏడుకొండలు, బాతు రామస్వామి, టి.శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాలకోడేరు : మే 1న నిర్వహించబోయే శ్రామిక వారోత్సవాల సంబరాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు పిలుపునిచ్చారు. సిఐటియు మండల కమిటీ సమావేశం పాలకోడేరు ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతులు వ్యవసాయ కూలీలు అందరినీ సంబరాల్లో మమేకం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అశ్రియ్య, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు లార్సన్ కుమారి, వైఎస్ఎన్.మూర్తి, డి.మరియమ్మ, అంగన్‌వాడీ నేతలు విమల, శాలిని పాల్గొన్నారు.

రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం తగదు: సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ
రాష్ట్రాల హక్కులపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్‌కె విల్లాలో సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న శాఖా కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతులు రెండో రోజు కొనసాగాయి. సిపిఎం అఖిల భారత మహాసభల రాజకీయ తీర్మానం – నిర్మాణ నివేదిక అంశాలను గోపాలన్ కార్యకర్తలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం రాష్ట్రాల ఆర్థిక వనరులను లాక్కొని రాష్ట్రాలను మున్సిపాల్టీల మాదిరిగా మారుస్తోందని విమర్శించారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాలకు నిధుల కేటాయింపు బడ్జెట్లో లేదన్నారు. రెండో రోజు శిక్షణా తరగతులకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిపి ప్రతాప్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, పెనుగొండ మండల కార్యదర్శి సూర్నీడి వెంకటేశ్వరరావు, పెనుమంట్ర మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, ఎస్‌విఎన్.శర్మ, ఎ.అజయకుమారి, డి.విజయలక్ష్మి, గార రంగారావు, బళ్ల చిన వీరభద్రం, షేక్ పాదుషా, బత్తుల విజయ్ పాల్గొన్నారు.

కాళ్ల పంచాయతీకి నాలుగు పురస్కారాలు

ప్రజాశక్తి - కాళ్ల
మండలంలోని 21 పంచాయతీలకు గాను 12 పంచాయతీలకు అవార్డులు రావడంపై ఎంపిపి శిరీష విశ్వనాథరాజు హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక సుస్థిరాభివద్ధి లక్ష్యాల చేరువలో భాగంగా నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో కాళ్ల గ్రామ పంచాయతీ నాలుగు అంశాల్లో సత్తా చాటింది. ఆరోగ్యం, పంచాయతీ, సుపరిపాలన, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు అవార్డులను సాధించింది. ఈ సందర్భంగా కాళ్ల సర్పంచి బందా విజయ, గ్రామ కార్యదర్శి సతీష్‌కుమార్, సచివాలయ కార్యదర్శి ఎస్.సింధూజలను దుశ్శాలువాతో సన్మానించి అవార్డులను అందజేశారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శులను సత్కరిస్తున్న ప్రముఖులు

కొత్త టెండర్ విధానం రద్దు చేయాలని ర్యాలీ

తణుకురూరల్: ఎపి సీడ్స్‌లో కొత్త టెండర్ విధానం రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పైడిపర్రులోని వినాయక గుడి నుండి గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీగా వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సీడ్స్‌లో కార్మిక చట్టాలు ఉన్నాయన్న సంగతి మరచి అధికారులు వ్యవహరించారన్నారు. 50 సంవత్సరాల నుంచి చట్ట బద్ధంగా పనిచేస్తున్న వారి పట్ల పాటించాల్సిన పద్ధతులకు భిన్నంగా సీడ్స్‌లో చేయడం సిగ్గుచేటన్నారు. టిఎన్‌టియుసి నాయకులు గండి రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన వారే ఉపాధి లేకుండా చేస్తారా ప్రశ్నించారు. కార్మికుల పోరాటానికి మద్దతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, గుబ్బల గోపి, టి.రామకృష్ణ, గాది త్రిమూర్తులు, వరలక్ష్మీ, రూతమ్మ, సత్యవతి, సాంబశివరావు పాల్గొన్నారు.

అమూల్ పాల సేకరణ పెంచాలి : కలెక్టర్

భీమవరం : అమూల్ పాల సేకరణ పెంపుదలకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గ్రామీణ అభివృద్ధి, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమావేశమై అమూల్ పాల సేకరణ, చేయూతలపై సమీక్షించారు. పాల సేకరణ తక్కువగా ఉందని, సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదని తెలిపారు. యలమంచిలి, తాడేపల్లిగూడెం నరసాపురం, పాలకొల్లు మండలాల్లోని చాలా గ్రామాల్లో పాల సేకరణ తక్కువగా ఉండటంపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. పాడి రైతులతో సమావేశమై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. చేయూత పథకం ద్వారా కొనుగోలు చేసిన పాడిపశువులకు సంబంధించిన పాలు నూరు శాతం అమూల్‌కు కచ్చితంగా అందజేయాలన్నారు. ఇతర పాడి రైతుల నుంచి కూడా ఒక్కొక్కరి వద్ద నుండి కనీసం లీటర్ అమూల్‌కు ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. చేయూత పథకం ద్వారా 19 మండలాల్లో 8,318 పాడి పశువులు అందజేసేందుకు లక్ష్యంగా తీసుకోగా ఇప్పటివరకూ వాస్తవంగా ఎన్ని పశువులను అందజేశారు. ఇంకా ఎన్ని కొనుగోలు చేయాలనే పూర్తి వివరాలను పశుసంవర్ధక, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు రానున్న 15 రోజుల్లో క్షేత్రస్థాయి నివేదికను అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, డిఆర్‌డిఎ ఎపిఒలు పాల్గొన్నారు.

మీ హయాంలో జరిగిన అభివృద్ధి చూపండి : గ్రంధి

భీమవరం రూరల్: భీమవరం పట్టణాన్ని నాడు, నేడు తాను మాత్రమే అభివృద్ధి చేశానని, మీ హయాంలో ఏం అభివృద్ధి జరిగిందో ఒక్క ల్యాండ్ మార్క్ చూపించాలని ప్రతిపక్షాలను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా 32వ వార్డు కరణం వీధిలో రూ.39.90 లక్షలతో నిర్మించిన ఇందిరా గాంధీ బొమ్మ నుండి విజయా నివాస్ వరకూ సీసీ రోడ్డు, సీసీ డ్రెయినేజీ, ఆర్‌సిసి స్లాబ్ కల్వర్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.49.70 లక్షలతో 32వ వార్డులోని సాయిబాబా గుడి నుండి రాయలం వంతెన వరకూ సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్, కల్వర్టు పనులకు, 37వ వార్డులో రూ.32.60 లక్షలతో నిర్మించనున్న రోడ్డు, డ్రెయినేజీ, కల్వర్టు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం
పేరిచర్ల ఫౌండేషన్ డైరెక్టర్ ముదునూరి నితిన్‌వర్మ, ఉమాదేవి కుమారుడు గగన్ శ్రీవర్మ పుట్టినరోజు సందర్భంగా పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు ముదునూరి శివరామ రాజు సౌజన్యంతో బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శివరామ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల ఫౌండేషన్, డైమండ్స్ లయన్స్ క్లబ్, వశిష్ఠ లియో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లంకలకోడేరు పిహెచ్‌సిలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్
లంకలకోడేరు పిహెచ్‌సిలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో మానసిక రోగులకు జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా డాక్టర్ హన్నా కోమలి పరీక్షలు నిర్వహించారు. అనంతరం 20 మందికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోమలి మాట్లాడారు. ఫిట్స్, స్కిజో ఫ్రీనియా, మతిమరుపు, ఆందోళన చెందడం తదితర మానసిక సమస్యలు ఉన్నవారు వెంటనే చికిత్స చేయించుకుంటే మామూలు వ్యక్తులుగా మాతారని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ శ్రీనివాస్ మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, పివి.స్వామి, పి.ఎలిజబెత్ పాల్గొన్నారు.

జగనన్న వసతి దీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి - ఉండి
జగనన్న వసతి దీవెనలో భాగంగా బుధవారం మండలంలోని 1039 మంది విద్యార్థులకు గాను 972 మంది తల్లుల ఖాతాలో 88,92,500 రూపాయల నగదును జమ చేయనున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ అధికారి చిత్రా కుమారి తెలిపారు. ఈ సందర్భంగా చిత్రా కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్యనందించాలనే ఉద్దేశంతో విద్యకు వేలకోట్ల రూపాయలు కేటాయిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థీ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చి భవిష్యత్తులో స్థిరపడాలని ఆమె ఆకాంక్షించారు.

28, 29 తేదీల్లో రాజమండ్రిలో సమావేశాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర
ఈ నెల 28, 29 తేదీల్లో గోదావరి మండలి పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలు రాజమండ్రి ఆర్అండ్‌బి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ ఎం.భరతలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుబ్బరామిరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని తెలిపారు. అంతేకాకుండా వివిధ పంటలకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు, వివిధ రంగాల్లో ప్రభుత్వ సాధించిన అభ్యుదయ రైతుల పాల్గొని వివిధ పంటలకు సంబంధించి సాగు సమస్యల గురించి చర్చించి, తదుపరి సంవత్సరానికి పరిశోధన, విస్తరణ ప్రణాళిక రూపొందిస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేరీపై దాడికి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు
పాలకొల్లుకు చెందిన మేరీపై కొందరు అగ్రవర్ణానికి చెందిన వ్యక్తులు దాడిచేయడాన్ని ఆల్ ఇండియా మాదిగ డెవలప్మెంట్ సంఘం తీవ్రంగా ఖండించింది. సంఘ్ జాతీయ అధ్యక్షుడు కూచిపూడి బాబూరావు ఘటనను తీవ్రంగా ఖండించారు. బుధవారం పాలకొల్లు ఎఎంసిలో నిజ నిర్ధారణ కమిటీ తరపున ఆయన మేరీ నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోలీసులు వెంటనే స్పందించలేదని, దళిత సంఘాలు 19న ఆందోళన చేశాక ఎస్‌సి, ఎస్‌టి కేసులు పెట్టారని, అప్పటికే ముద్దాయిలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని చెప్పారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము డిజిపిని కలుస్తామని, సిఎంకు ఫిర్యాదు చేస్తామని అవసరమైతే జాతీయ ఎస్‌సి కమిషన్, హైకోర్టుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రిటైర్డ్ ఎస్‌పి శిఖామణి, రిటైర్డ్ డిఎస్‌పి సిహెచ్ పాపారావు, వేలంగి శ్యామ్ మాదిగ, వీరాస్వామి పాల్గొన్నారు.

అనాకోడేరులో ఇదేం ఖర్మ రాష్ట్రానికి

ప్రజాశక్తి - భీమవరం రూరల్
టిడిపి మండల అధ్యక్షుడు రేవు వెంకన్న అధ్యక్షతన మండలంలోని అనాకోడేరులో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చెత్త పన్ను వసూలు చేస్తున్న జగన్ ప్రభుత్వం అధిక ధరలు అదుపుచేయకపోవడంతో ఇదేం ఖర్మ మనకని స్థానికులు వాపోతున్నారని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెంద్ర శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కౌరు పృథ్వీశంకర్, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పడమట సోమేశ్వరరావు, ఐటిడిపి మండల అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

అనుమతిలేని ఫ్లెక్సీల తొలగింపు : ఎస్ఐ

ప్రజాశక్తి - పెనుమంట్ర
మండలంలోని అన్ని గ్రామాల్లో అనుమతి లేని ఫ్లెక్సీలను వెంటనే తొలగిస్తున్నట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ ఫ్లెక్సీల వల్ల గ్రామాల్లో ఏమైనా వాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరిగే అవకాశం ఉన్నట్లు ముందస్తు సమాచారం ఉందని, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూసేందుకు అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు తెలిపారు.